

సమగ్ర శిక్ష ఏపీసీగా వేణుగోపాల్



శ్రీకాకుళం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ(అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్)గా పప్పల వేణుగోపాలరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను జారీచేసింది. ప్రస్తుతం కాకినాడలో పనిచేస్తున్న ఈయన.. గతంలో శ్రీకాకుళం జిల్లాలో తహసీల్దార్, డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత ఏపీసీ శశిభూషణరావుకు ఇంకా పోస్టింగ్ కేటాయించలేదు. ఆయన మాతృసంస్థ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా పనిచేశారు.

మూగబోయిన ఉద్దానం

- ఒకప్పుడు విప్లవోద్యమానికి మారుపేరు
- మావోయిస్టు నేత మెట్టూరు జోగారావు మృతితో నిశ్శబ్ద వాతావరణం
- ఇక మిగిలింది ఒక్కరే



బాతుపురంలో అమరుల స్మారక స్థూపం

పలాస, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు సాయుధ విప్లవోద్యమం ప్రారంభమైన ఉద్దానం ప్రాంతం.. నేడు మూగబోయింది. ఉద్దానం ప్రాంతంలో ఎంతోమంది విప్లవకారులు ఉద్యమాల్లో భాగస్వామ్యం అయ్యారు. గతంలో ఎన్‌కౌంటర్ ఘటనల్లో కొందరు మావోయిస్టులు అమరులు కాగా.. మరికొందరు జనజీవన స్రవంతిలో కలిశారు. చివరిగా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం గ్రామానికి చెందిన మావోయిస్టు నేతలు చెల్లూరు నారాయణరావు, మెట్టూరు జోగారావు(టెక్ శంకర్) మాత్రమే మిగిలారు. వీరిద్దరిలో కూడా తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లిలో బుధవారం ఉదయం జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో మెట్టూరు జోగారావు మృతి చెందారు. దీంతో విప్లవాల పురిటిగడ్డ ఉద్దానంలో చెల్లూరు నారాయణరావు ఒక్కరే మిగిలారు. ప్రస్తుతం జోగారావు మృతదేహం కోసం ప్రజా సంఘాల ప్రతినిధులు, అమరుల బంధుమిత్రుల కమిటీ సభ్యులతోపాటు జోగారావు కుటుంబ సభ్యులు రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వేచి చూస్తున్నారు. బాతుపురంతోపాటు ఉద్దానంలో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది.

కమిటీలో వారిది ప్రత్యేక స్థానం

చెల్లూరు నారాయణరావు, మెట్టూరు జోగారావుల స్వగ్రామమైన బాతుపురం అంటే మావోయిస్టు పార్టీ నాయకత్వానికి ఎంతో మక్కువ. ఆంధ్రా-ఒడిశా బోర్డర్ కమిటీలో వీరిది సముచితమైన స్థానం. జిల్లాకు చెందిన నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తరువాత వీరిద్దరికి మావోయిస్టు పార్టీలో కీలకబాధ్యతలు అప్పగించారు. హిడ్మా టీమ్‌లో వీరు చురుగ్గా ఉండేవారు. బాతుపురంలోని

(మిగతా 6వ పేజీలో..)

ఆయుధాల తయారీలో దిట్ట..

మెట్టూరు జోగారావు సాయుధపోరాటంలో చురుగ్గా పాల్గొనడంతోపాటు మావోయిస్టు చీఫ్ నంబాల కేశవరావు, హిడ్మా టీములో ప్రధాన సభ్యుడు. ఆయుధాల తయారీలో ఎంతో నేర్పరి. తుపాకులు, రాకెట్ లాంచర్లు తయారు చేయడంలో దిట్ట. పూర్తిగా సాంకేతిక పరిజ్ఞానం ఉండడంతో ఈయనకు సాయుధబలగాలు టెక్(టెక్నికల్)గా పిలుచుకుంటారు. జోగారావుకు టెక్ శంకర్, శివ అనే మారు పేర్లు ఉన్నాయి.



అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జోగారావు మృతదేహం కోసం నిరీక్షిస్తున్న బంధువులు, అమరుల బంధుమిత్రుల కమిటీ సభ్యులు

గద్దర్ సభకు ఆకర్షితులై..

- ఇదీ జోగారావు విప్లవ ప్రస్థానం

వజ్రపుకొత్తూరు/పలాస, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం గుణుపల్లి గ్రామం సముద్ర తీరంలో 1986లో విప్లవ నౌక గద్దర్ 'గుండెచప్పుడు' కార్యక్రమం పేరిట బహిరంగ సభ నిర్వహించారు. అర్ధరాత్రి జరిగిన ఈ సమావేశానికి శ్రీకాకుళం తీరప్రాంతంతోపాటు ఉద్దానం గ్రామాల ప్రజలంతా హాజరయ్యారు. ఈ క్రమంలో బాతుపురానికి చెందిన మెట్టూరు జోగారావు కూడా వచ్చారు. అక్కడ నుంచి అతనిలో విప్ల వోద్యమం బయటకు వచ్చింది. ముందుగా కొరియర్‌గా మారాడు. జిల్లా అంతా అప్పటి పీపుల్స్‌వార్ పార్టీతో అనుబంధాన్ని కొనసాగిస్తూ అక్కడ నుంచి అడవిబాట పట్టారు. ఇంటినుంచి బయటకు వెళ్లిన జోగారావు మరి ఇక తిరిగి రాలేదు. ఆయన తరువాత చెల్లూరు నారాయణరావు కూడా విప్లవబాట పట్టారు. ఇద్దరూ



మెట్టూరు జోగారావు(ఫైల్)

(మిగతా 6వ పేజీలో..)

ఇంకెన్నాళ్లు?

- పూర్తికాని టిడ్కో ఇళ్ల నిర్మాణం
- దశాబ్ద కాలంగా లబ్ధిదారుల ఎదురుచూపు
- అద్దెలు, రుణాల చెల్లింపు భారంతో ఇబ్బందులు

ఇచ్ఛాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల సొంతింటి కల నెరవేరడం లేదు. దశాబ్ద కాలం అవుతున్నా టిడ్కో ఇళ్లు పూర్తికావడం లేదు. దీంతో పట్టణాల చెంతనే టిడ్కో ఇళ్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి టీడీపీ హయాంలో పునాది పడింది. కానీ వైసీపీ ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత దృష్టి సారించినా.. పనులు ఎప్పటికి పూర్తవుతాయోనని, ఇళ్లు ఎప్పుడు అప్పగిస్తారోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

- ఇదీ పరిస్థితి..

జిల్లాలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస మునిసిపాలిటీలు ఉన్నాయి. పట్టణంలో పేద ప్రజల కోసం 2014లో టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణానికి పూనుకుంది. విపత్తులకు తట్టుకునే విధంగా వాటి నిర్మాణం పూర్తిచేయాలని భావించింది. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా 3,536 టిడ్కో ఇళ్లు మంజూరయ్యాయి. ఇచ్ఛాపురం పట్టణంలో రూ.16.10కోట్లతో 192 ఇళ్లను, పలాస- కాశీబుగ్గలో రూ.65.20 కోట్లతో 912 ఇళ్లను, ఆమదాలవలసలో రూ.35.50కోట్లతో 528 ఇళ్లను, శ్రీకాకుళం-1లో రూ.78.40 కోట్లతో 1,280 ఇళ్లను, శ్రీకాకుళం-2లో రూ.40.23 కోట్లతో 624 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. కానీ ఇప్పటివరకూ శ్రీకాకుళం-1లోని 1,280 ఇళ్లను మాత్రమే పూర్తిచేసి లబ్ధిదారులకు అందించారు. వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చూపింది. లోపల పనులు పూర్తిచేయకుండానే బయట వైసీపీ రంగులతో నింపేసింది. దీంతో లబ్ధిదారులకు ఇళ్లు అందని ద్రాక్షగా మిగిలాయి. మరోవైపు లబ్ధిదారులు అద్దె గృహాల్లో కొనసాగుతున్నారు. అటు ఉన్న ఇంటికి అద్దె కడుతున్నారు. ఇటు టిడ్కో ఇంటికి సంబంధించి బ్యాంకు రుణాలు కట్టేందుకు ఆపసోపాలు పడుతున్నారు. ఇంకెన్నాళ్లు తాము ఇళ్ల కోసం ఎదురుచూడాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైన తమ ఇబ్బందులు గుర్తించి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి తమకు అప్పగించాలని కోరుతున్నారు.

- కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్లకు సంబంధించి పెండింగ్ పనులతోపాటు మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించింది. పెండింగ్ నిధులు విడుదల చేయడంతో పనులకు మోక్షం కలిగింది. ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలసలో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. అక్కడక్కడా ప్యాచ్‌వర్క్‌లు పూర్తిచేయాల్సి (మిగతా 7వ పేజీలో..)

త్వరితగతిన పనులు

వచ్చే ఏడాది మార్చి నాటికి టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. శ్రీకాకుళం-2లో తప్ప అన్నిచోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మౌలిక సదుపాయాలను మాత్రమే కల్పించాల్సి ఉంది. ప్రస్తుతం ఆ పనులు జరుగుతున్నాయి.

- బి.హరి, డీఈఈ, టిడ్కో విభాగం



ఇచ్ఛాపురం ఏఎస్ పేటలో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న టిడ్కో గృహాలు



బారువలో సముద్ర తీరం

నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం

శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో శుక్రవారం ప్రపంచ మత్స్య దినోత్సవం నిర్వహించ నున్నారు. రాష్ట్రస్థాయిలో జరగనున్న ఈ కార్యక్రమానికి మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్ నాయక్, ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ హాజరుకానున్నారు. జిల్లాలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్, అధికారులు, మత్స్యకార ప్రతినిధులు పాల్గొనున్నారు.

సువిశాల తీరం.. ఏదీ ప్రయోజనం?

- జిల్లాలో 132 రకాల మత్స్య సంపద లభ్యం
- మోటరైజ్డ్ బోట్లతోనే సముద్రంలో వేట
- సౌకర్యాలు మెరుగుపడితే మరింత లాభం
- ఆ మూడు ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తేనే..

శ్రీకాకుళం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక తీరప్రాంతం ఉండే జిల్లా శ్రీకాకుళం. ఏకంగా 193 కిలోమీటర్లు తీరప్రాంతం కలిగిఉంది. ఇక్కడి మత్స్యకారులు సముద్రం, నదులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో సముద్రం, చెరువుల నుంచి 132 రకాల మత్స్య సంపద లభిస్తుంది. విశాఖ మాదిరిగా హార్బర్ అందుబాటులో లేకపోవడం, జెట్టీలు పూర్తి కాకపోవడంతో మత్స్యకారులు మోటారు బోట్లతో వేట సాగిస్తున్నారు.

సముద్ర తీరం పొడవు	: 193 కి.మీ
తీర ప్రాంత మండలాలు	: 11
కోస్టల్ తీరప్రాంత గ్రామాలు	: 104
తీరప్రాంత మత్స్యకారుల జనాభా	: 1,12,456
మొత్తం ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌లు	: 60
మోటరైజ్డ్ బోట్లు	: 1,623
మత్స్యకార గ్రామాలు	: 164
సంప్రదాయ మత్స్యకారులు	: 42,565
ఇన్‌ల్యాండ్ యాక్టివ్ ఫిషర్‌మెన్	: 11,273
మంచినీటి చెరువులు	: 183

జిల్లాలో మత్స్య సంపద ఇలా..

ఏడాదికి సముద్రం నుంచి సుమారు 810 టన్నుల చేపలు, రొయ్యలు సేకరించి.. విక్రయిస్తున్నారు. అలాగే రొయ్యల ఉత్పత్తిని పరిశీలిస్తే.. మంచినీటి చెరువులు, ఉప్పునీటి చెరువుల్లో ఏడాదికి 1,52,137 టన్నుల ఉత్పత్తి ఉంది. మంచినీటి చెరువుల్లో చేపలు, రొయ్యలు కలిపి.. 9,212 టన్నుల ఉత్పత్తి ఏడాదికి లభిస్తుంది. వీటి విలువ రూ.153 కోట్లు పైబడి ఉంది. సముద్రపు, మంచినీటి చెరువుల ద్వారాను.. మొత్తం రూ. 500 కోట్ల మేర విక్రయాలు సాగుతున్నాయి. హార్బర్లు, జెట్టీలు అందుబాటులో లేకపోవడంతో.. మోటారు బోట్లతోనే సముద్రంలో ఎనిమిది కిలోమీటర్ల మేర వేటకు వెళ్తున్నారు. ఇక్కడి నుంచి విశాఖపట్నం వరకే ఎగుమతి అవుతున్నాయి. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

వేట సాగించే కేంద్రాలు : మత్స్యలేశం, కళింగపట్నం, నువ్వులరేవు, భావనపాడు, బారువ

లభిస్తున్న చేపల రకాలు.. ధరలు

జిల్లాలో 132 రకాల మత్స్య సంపద.. (చందువ, పట్టుసావళ్లు, నత్తళ్లు, కోనెం, గురివింద, వంజరం, పండుగప్ప, వోలు కనస, కవ్వళ్లు, రొయ్యలు, పీతలు.. అలాగే చెరువులు.. నదుల్లో రొయ్య, బొచ్చు, గడ్డిచేపలు, కొర్రమీను)

(మిగతా 6వ పేజీలో..)

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు
- మండలస్థాయిలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహణ
- ప్రతిభ కనబరిచేవారు రాష్ట్ర పోటీలకు ఎంపిక

6లో

రథసప్తమి ఏర్పాట్ల పరిశీలన
- భక్తుల రద్దీకి అనుగుణంగా చర్యలు
- అధికారులకు ఎస్పీ, ఎమ్మెల్యే పలు సూచనలు

6లో

తుఫాన్ హెచ్చరికలతో కలవరం

ముగిసిన పుస్తక మహోత్సవం 7లో

భూ వివాదంలో ఇరువర్గాల కొట్లాట 8లో



స్థానికులు స్తంభానికి కట్టిన అనుమానితులు వీరే

ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడిపై దాడి

- మెడపై కత్తిపెట్టి రూ.20వేలు దోచుకున్న వైనం
- పారిపోతుండగా దొంగలను పట్టుకున్న స్థానికులు

8లో

పంచాయతీరాజ్‌శాఖలో పదోన్నతులు

- 26 మందికి డిప్యూటీ ఎంపీడీవోలుగా ప్రమోషన్

నరసన్నపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌శాఖలో పదోన్నతుల జాతర ప్రారంభమైంది. ఇటీవల డిప్యూటీ ఎంపీడీవోలకు ఎంపీడీవోలుగా పదోన్నతి లభించింది. తాజాగా ప్రభుత్వం సీనియర్ సహాయకులు, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిలకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించింది. జోన్-1 పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 111 మందికి పదోన్నతి దక్కింది. జిల్లాలో మేజర్ పంచాయతీల్లో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిలుగా పనిచేస్తున్న 9 మందికి పదోన్నతి కలిగింది. వీరిలో ఎస్.రామ్మోహన్‌రావు. ఎం.నారాయణమ్మ, కె.మోహనబాబు, పల్లి ద్రాక్షాయిణి, జి.త్రినాథరావు, ఎం.శాంతకుమారి, ఎల్.లక్ష్మణమూర్తి, ఎన్.శ్రీనివాసరావు. ఎస్.ఉమాపతి ఉన్నారు. కొందరిని జిల్లాకు కేటాయించగా.. మరికొందరిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు.

అలాగే జడ్పీ పరిధిలో పనిచేస్తున్న 17 మంది సీనియర్ సహాయకులకు పదోన్నతి లభించింది. వీరిలో ఎస్. రామ్మోహన్‌రావు (జడ్పీ, శ్రీకాకుళం), టి.వి లీలారాజు (డివిజన్ కార్యాలయం, శ్రీకాకుళం) ఎస్.అడివిరాముడు(మండల పరిషత్, సరుబుజ్జిలి), ఎ.మృత్యుంజయరావు (మండల పరిషత్, లావేరు) డి.అప్పన్న(శ్రీకాకుళం డివిజన్) టి.తారకేశ్వరరావు (జడ్పీ), పి.శిరీష(మండల పరిషత్ కార్యాలయం, కొత్తూరు) పి.వెంకట్రావు, (మండల పరిషత్, రాజాం) జి.సంధ్యారాణి (పీఆర్, సబ్‌డివిజన్ కార్యాలయం- నరసన్నపేట) జీ.వీ. అప్పలనాయుడు (మండల పరిషత్, నందిగాం) ఎస్.శాంతారావు (ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం -నరసన్నపేట) పి.శ్రీనివాసరావు (మండల పరిషత్, గార) కె.అనురాధ(జడ్పీ) జి.తులసీదాస్ (జడ్పీ) ఎం.శ్రీనివాసరావు (జడ్పీ) ఎం.సంతోష్‌కుమార్(శ్రీకాకుళం డివిజన్) బి.హరినారాయణ(జడ్పీ) ఉన్నారు. వీరికి జిల్లాలోనే పోస్టింగ్‌లు కేటాయించారు. పదోన్నతి పొందిన వారికి రాష్ట్ర పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోయేషన్ జిల్లా శాఖ అధ్యక్షులు కె.నారాయణరావు, ప్రధాన కార్యదర్శి కింజరాపు నరసింహామూర్తి అభినందనలు తెలిపారు.

తీరప్రాంత గ్రామాల్లో మెరైన్ పోలీసుల తనిఖీ

గార, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తీరప్రాంత సాగర్‌కవచ్‌లో భాగంగా గురువారం కళింగపట్నం మెరైన్ సీఐ డి.ప్రసాదరావు సిబ్బంది, గార పోలీసులు మండలంలోని పలు ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేశారు. ముంబై దాడుల నేపథ్యంలో తీరప్రాంత భద్రతలో భాగంగా మెరైన్ డీఐజీ ఆదేశాల మేరకు శ్రీకూర్మం, గార, కళింగపట్నం తదితర ముఖ్యకూడళ్లతోపాటు తీరప్రాంత గ్రామాల్లో వాహనాలను తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న మెరైన్ పోలీసులు



పీర్లకొండపై దర్గావద్ద భక్తుల తాకిడి

ఘనంగా పీర్లకొండ యాత్ర

- మత సామరస్యానికి ప్రతీక..

6లో

నిజాయితీని చాటుకున్న విద్యార్థి

● 2 తులాల బంగారు గొలుసు అప్పగింత



రోహిత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే

ఇచ్ఛాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి 21వ వార్డు గొల్లవీధికి చెందిన రోహిత్ పూరి అనే విద్యార్థి తనకు దొరికిన సుమారు రూ.3 లక్షల విలువ చేసే 2తులాల బంగారం గొలుసును సదరు వ్యక్తికి అందించి తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన మాజీ సైనికోద్యోగి డి.విశ్వనాథంరెడ్డి బుధవారం సాయంత్రం బైక్‌పై వెళ్తుండగా తన మెడలో ఉన్న బంగారు గొలుసు పడిపోయింది. ఆ తర్వాత గొలుసు పోయిందని గుర్తించి వెతికినా ఫలితం లేకపోయింది. ఆ బంగారు గొలుసు రోహిత్‌కు దొరికింది. గొలుసు విశ్వనాథంరెడ్డిదని తెలిసి అతనికి తెలిపాడు. దీంతో విశ్వనాథం ఆనందం వ్యక్తం చేశారు. ఈ గొలుసును రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ ద్వారా విశ్వనాథంరెడ్డికి అందించారు. రోహిత్ నిజాయితీని ఎమ్మెల్యే మెచ్చుకుని గురువారం అభినందించారు. టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి, విద్యార్థి తండ్రి లోకనాథ్ పూరి పాల్గొన్నారు.

ఘనంగా పీర్లకొండ యాత్ర

● మత సామరస్యానికి ప్రతీక..



మెట్టుపై కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు



దర్గాలో పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన పీర్లకొండ యాత్రకు గురువారం భక్తులు పోటెత్తారు. పరిసర ప్రాంతాలతో పాటు ఒడిశా, హైదరాబాద్, వైజాగ్ తది తర ప్రదేశాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పీర్ల స్వామికి అత్యంత ఇష్టమైన అటుకులు, బెల్లాన్ని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం కొండపై ఉన్న రెండు మందిరాల్లో పూజలు చేశారు. కొండపై ఉన్న కందకంలో నీటిని పవిత్ర తీర్థంగా స్వీకరించారు. కాగా ఈ ఏడాది సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పిల్లల తలనీలాలు అర్పించారు. కోరికలు తీరాలని దర్గా చుట్టూ గీతలు గీశారు. స్వామి ప్రసా దంగా విభూదిని అందుకొని ప్రదక్షిణలు చేశారు. కొండపై కూర్చొని ఉన్న భక్తులకు చుట్టూ ఉన్న విదేశీ పక్షులు కనువిందు చేశాయి. తేలు కుంచి గ్రామం చెట్లపై ఉన్న విదేశీ పక్షులు, చిలక సముద్రం, కైలాసగిరిని చూసి ఆహ్లాదంగా గడిపారు. రైల్వే స్టేషన్ మీదుగా భక్తులు కొండకు భక్తులు రావటంతో ఆ ప్రాంతం అంతా కిటకిటలాడింది. కొండపై ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుం డా సీఐ ఎం.చిన్నమనాయుడు, పట్టణ ఎస్‌ఐ ముకుందరావు బందోబస్తు ఏర్పా టు చేశారు. కొండపై కూ డా తోపులాటలు లేకుం డా కొండ మెట్లపై క్యూలైన్ ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

● మండలస్థాయిలో ఈ నెల 29,30 తేదీల్లో నిర్వహణ

● ప్రతిభ కనబరిచేవారు రాష్ట్ర పోటీలకు ఎంపిక



నరసన్నపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి మరింత ఉత్సాహంగా బోధన చేసేలా సామర్థ్యాలు పెంచేందుకు ప్రభుత్వం వారికి ఆటల పోటీలు నిర్వహిస్తోంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఈనెల 16న ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపాలటీ, ఎయిడెడ్ పాఠశాలల్లో 10,432 వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో అంతర్లీనంగా ఉన్న క్రీడానైపుణ్యాలను వెలికితీసేందుకు చర్యలు చేపట్టింది. పురుష టీచర్లకు క్రికెట్, మహిళా టీచర్లకు త్రోబాల్ వంటి పోటీలు నిర్వహిస్తోంది. తొలుత మండల స్థాయి, తర్వాత డివిజన్‌స్థాయి, జిల్లా స్థాయిలో నిర్వహించనున్నారు. ఈ పోటీల బాధ్యతలను మండల స్థాయిలో స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్‌కు అప్పగించారు. మండల స్థాయిలో ఎంఈవో 1, 2 నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఈవో, జిల్లాస్థాయిలో డీఈవో, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సమన్వయకర్తలుగా ఉంటారు. రాష్ట్రస్థాయిలో పోటీలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు తీసుకుంటారు. పోటీలకు తొలుత మండల స్థాయి జట్లను ఎంపిక చేస్తారు. తరువాత మండలస్థాయిలో ప్రతిభ కనపరిచేవారు డివిజన్‌స్థాయిలో.. అక్కడి నుంచి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు. అక్కడ ప్రతిభ కనపరిచే ఉపాధ్యాయులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.

ఈనెల 29 నుంచి పోటీలు

మండల స్థాయిలో పోటీలను ఈనెల 29, 30 తేదీలలో నిర్వహించనున్నారు. డివిజన్ స్థాయిలో డిసెంబరు 13, 14 తేదీలలో, జిల్లాస్థాయిలో డిసెంబరు 20,21,22 తేదీలలో, రాష్ట్రస్థాయిలో జనవరి 2,3,4 తేదీల్లో జరుపుతారు. ఈ ఆటల ద్వారా ఉపాధ్యాయుల్లో శారీరక ధృఢత్వం, ఆరోగ్యం పెంపొందించి ఒత్తిడిని తగ్గించవచ్చని అధికారులు చెబుతున్నారు. జట్టు స్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవచ్చంటున్నారు. జిల్లాలో 30 మండలాలు, మూడు రెవెన్యూ డివిజన్లతో పాటు, జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి మండలానికి రూ. 5వేల చొప్పున, ప్రతి డివిజన్‌కు రూ.20వేల చొప్పున, జిల్లాస్థాయిలో పోటీలకు రూ.20వేల బడ్జెట్ కూడా కేటాయించారు.

ఇది మంచి కార్యక్రమం

ఇన్నాళ్లు పిల్లలకు ఆటపోటీలను నిర్వహించాం. తొలిసారిగా ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఆటపోటీలను నిర్వహించడం చాలా మంచి కార్యక్రమం. లీప్ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చు. లేదా మండల స్థాయి పోటీలు జరిగే రోజున నేరుగా పాల్గొనే అవకాశం ఉంది. ఆసక్తిగల ఉపాధ్యాయులు ఎంఈవోలకు సమాచారం ఇవ్వాలి.

- బి.వెంకటరమణ, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి, శ్రీకాకుళం



ఆత్మస్థైర్యం పెరుగుతుంది

క్రీడాపోటీలను నిర్వహించడం ద్వారా ఉపాధ్యాయుల్లో స్నేహభావం పెరుగుతుంది. పాఠశాల నుంచి బయటకు వచ్చిన ఫీలింగ్ కలుగుతుంది ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ఈ పోటీలను పకడ్బందీగా నిర్వహిస్తాం.

- రవిబాబు, డీఈవో, శ్రీకాకుళం

మూగబోయిన ఉద్దానం

(ఐదో పేజీ తరువాయి)

విప్లవోద్యమంలో వీరిద్దరిదీ ఒక్కో చరిత్ర. పీడిత ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాడుతూ అనేక సమస్యలు పరిష్కరించారు. మెండు జీడితోటలు గిరిజనుల పరం చేయడం, అనేక కొండపోరంబోకు భూములను గిరిజనులకు పట్టాలు ఇప్పించడంలో కీలకంగా వ్యవహరించారు. విద్య, వైద్యం, సాగు, తాగునీరు, విద్యుత్‌దీపాలు, రహదారులు ఉద్దానం ప్రాంతంలో అభివృద్ధి చేయడానికి సాయుధ విప్లవకారుల కృషి చరిత్రలో మిగిలిపోయింది.

బాతుపురానికి ఎంతో చరిత్ర

2011లో ఉమ్మడి ఆంధ్రప్ర దేశ్‌లో మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని, చర్చలు ద్వారా సమస్యలు పరిష్కరించుకుందామని రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని మావోయిస్టులపై కొన్నాళ్ల పాటు నిషేధాన్ని ఎత్తివేస్తూ.. వారిని చర్చలకు పిలిపించారు. అనంతరం మావోయిస్టులు రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించి ప్రజలకు చైతన్యం కల్పించారు. అందులో భాగంగా మొగిలిచర్లతో పాటు బాతుపురంలో కూడా భారీ బహిరంగ సభ నిర్వహించగా విప్లవకారుల ప్రతినిధులు వరవరరావు, కళ్యాణరావు, గద్దర్‌తో పాటు ప్రజాకవి వంగపండు ప్రసాదరావు తదితరులు తరలివచ్చారు. సభలో పాల్గొని తమ వాదనను ప్రజల్లో బలంగా వినిపించారు. అంతటి చరిత్ర బాతుపురానికి ఉంది.



బాతుపురం సభకు హాజరైన విప్లవ ప్రతినిధులు గద్దర్, వరవరరావు, కళ్యాణరావు, వంగపండు ప్రసాదరావు(ఫైల్)

గద్దర్ సభకు ఆకర్షితులై..

(ఐదో పేజీ తరువాయి)

ముందుగా పీపుల్స్‌వార్‌లోను, తరువాత మావోయిస్టు పార్టీలో కీలక నేతలుగా కొనసాగుతున్నారు. మావోయిస్టు చీఫ్ నంబాల కేశవరావుకు కుడిభుజంగా వీరిద్దరు పనిచేశారు. ఉద్దానంలో తిరిగిన సుధ దళం పిలుపుమేరకు జోగారావు అడవిబాట పట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో అప్పట్లో జీడి గిట్టుబాటు ధర కోసం ఎక్కువ పోరాటాలు జరిగాయి. దీంతోపాటు గిరిజనులకు భూహక్కుల కోసం పోరాటం నడిచేది. ఈ రెండు ఉద్యమాల్లోనూ జోగారావు కీలకంగా పాల్గొని విజయం సాధించారు. అంచెలంచెలుగా ఎదిగి ఏవోబీ కమాండర్‌గాను, తర్వాత కీలకనేతకు కుడిభుజంగా ఎదిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర రాష్ట్రాల్లో అనేక పోరుబాటల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. 1990 సంవత్సరం తరువాత చంద్రగిరిలో ఆయన అరెస్టు కాగా జైలులో 10 నెలలకు పైగా గడిపారు.

కుటుంబ నేపథ్యం

జోగారావు తల్లిదండ్రులు చిన్నపిల్లమ్మ, కామయ్య రజక వృత్తి చేస్తూ జీవనం సాగించేవారు. 2021 సంవత్సరం మార్చిలో తండ్రి మృతి చెందగా.. ఈ ఏడాది జూలై 24న తల్లి ప్రాణాలు కోల్పోయింది. మావోయిస్టు పార్టీ నిషేధం ఉన్న కారణంగా తల్లిదండ్రుల అంత్యక్రియలకు జోగారావు హాజరు కాలేకపోయారు. జోగారావు పెద్దన్నయ్య యువరాజు హైదరాబాద్‌లో ఉండగా, తమ్ముడు శ్యామ్ దుబాయ్‌లోను, మరో తమ్ముడు మధు విశాఖపట్నంలో ప్రైవేటు పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అక్కాచెల్లెళ్లు శేషమ్మ, మోహినిలు ధర్మపురం, కుంటికోట గ్రామాల్లో ఉంటున్నారు. ప్రస్తుతం బాతుపురంలోని జోగారావు నివాసంలో తమ్ముడు శ్యామ్ భార్య, పిల్లలు ఉన్నారు.

సువిశాల తీరం.. ఏదీ ప్రయోజనం?

(ఐదో పేజీ తరువాయి)

లభిస్తోంది. చెరువుల్లో లభించే చేపల ధరలు పరిశీలిస్తే.. గడ్డి చేప టన్ను రూ. 90000, బంగారుపాప(గోల్డెన్‌ఫిష్) రూ.1,30,000, కేట్ ఫిష్ రూ. 1,00,000, కొర్రమీను(సవడ) రూ. 1,50,000, ఎర్రమైలు, రేయ, బొచ్చు చేపలు రూ. 1,10,000.. పలుకుతున్నాయి. కిలో చొప్పున రూ. 90 నుంచి రూ. 150 వరకు లభిస్తున్నాయి. మంచినీటి చేపలు ఎక్కువగా ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. రొయ్యలు టన్ను ధర.. రకాలను బట్టి రూ.5లక్షల వరకు ఉంది. ఇక సముద్ర చేపల ధరలు పరిశీలిస్తే.. కోనేం కిలో రూ. 400, పండుగప్ప రూ. 250, గురివిందలు రూ.200, చందువ రూ.150, రొయ్యలు కిలో రూ.500, వంజరం రూ.500కు లభిస్తున్నాయి.

మరింతగా లభించాలంటే..

ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, మంచినీళ్ల పేట వద్ద జెట్టీ నిర్మాణం పూర్తి కావాలి. ప్రస్తుతం పనులు జోరందుకున్నాయి. మూలపేట పోర్టు దాదాపు పూర్తి అయినట్లే. ఇక మత్స్యకారులు.. చేపలు నిల్వ చేసుకునేందుకు అవసరమైన కోల్డ్‌స్టోరేజీలు జిల్లాలో లేవు. అలాగే మెకనైజ్డ్ బోట్లు కూడా ఎవరికీ లేవు. ఉన్నవన్నీ.. మోటరైజ్డ్ బోట్లు మాత్రమే. దీంతో ఆశించిన స్థాయిలో వేట సాగడంలేదు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) కింద 15 తీర గ్రామాలను ఎంపిక చేశారు. పెద్దగనగళ్లవానిపేట, ఇద్దివానిపాలెం, దేవునల్తాడ ప్రాంతాల్లో రూ.2 కోట్లతో వలలు భద్రపరుచుకునేందుకు భవనాల కోసం మంజూరు చేశారు. కానీ ఇంకా పనులు పూర్తికాలేదు. అలాగే సంప్రదాయ మత్స్యకారుల విషయానికొస్తే.. స్థానికంగా పంచాయతీల్లో వేలంపాట ద్వారాను.. సొసైటీల ద్వారాను చెరువులను లీజుకు తీసుకుంటున్నారు. చెరువుల లీజులు.. భారీగా ఉంటున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా పంచాయతీ కమిటీలు వేరుగా నిర్ణయిస్తున్నాయి. దీంతో చేపల పెంపకం ఖర్చు గణనీయంగా పెరిగిపోయింది.

తీరప్రాంత మత్స్యకారులకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలి:

తీర ప్రాంత మత్స్యకారులకు మెకనైజ్డ్ బోట్లు లేవు. అవి ఉంటే సముద్రంలో కొన్ని రోజుల తరబడి వేట చేసుకునేందుకు వీలుంటుంది. అలాగే జెట్టీలు పూర్తిచేయాల్సిఉంది. తీరప్రాంత మత్స్యకారుల అవసరాల్ని గుర్తించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ప్రయోజనముంటుంది.

- మైలపల్లి నర్సింగరావు, జిల్లా మాజీ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు

తుఫాన్ హెచ్చరికలతో కలవరం

● పంటను భద్రపరుచుకునేందుకు రైతుల ఇక్కట్లు



నందిగాంలో ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

నందిగాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం ఆకా శం మేఘావృతం కావడం తో రైతులు కోసిన చేలును కుప్పలు పెట్టడంతో పాటు కల్లాలకు చేర్చిన ధాన్యాన్ని భద్రపరిచే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నెల 22 నుంచి బంగాళాఖాతంలో అల్పపీడనం ఉందన్న వాతావరణశాఖ సూచనలకు మేఘాలు తోడవ్వడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఆరబెట్టిన ధాన్యాన్ని భద్రపరిచే పనిలో నిమగ్నమయ్యారు.

కోటబొమ్మాళిలో...

కోటబొమ్మాళి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మండలంలో రైతులు వరి పంట కోతలలో తలమునకలై ఉన్నారు. ఇప్పటి వరకు దోమపోటు, అగ్గితెగుళ్లతో పాటు మొంథా తుఫా నుల బారి నుంచి ఎలాగో గట్టెక్కామని అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు తుఫాన్ హెచ్చరికలు రావడం, ఆకాశం ఒక్కసారిగా గురువారం సాయంత్రా నికి మేఘావృతం కావ డంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. కొన్ని చోట్ల పొలాల్లో కుప్పలు పెట్టినప్పటికీ మరికొన్ని చోట్ల నిన్న, మొన్న కోసిన చేను ఆరబెట్టి ఉన్నారు. మరికొన్ని గ్రామాల్లో యంత్రాలతో కోసిన ధాన్యం ఎండ బెడుతున్నారు. ఇలాంటి సమయంలో వర్షాలు కురిస్తే వరిచేను నీటమునిగి తమ కష్టం గంగపాలవుతుందని రైతులు ఆందోళన చెందుతు న్నారు. అనేకచోట్ల కుప్పలు పెట్టడం..టార్పాలిన్లు కప్పడం వంటి పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు.

పలాసలో...



పలాసరూరల్: కైజోల సమీపాన వరికుప్పలపై కప్పిన పరదాలు

పలాసరూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు గురువారం చిన్నపాటి చినుకులు పడడంతో పలాస మండలంలో రైతులు కోసిన చేనును భద్ర పరిచేందుకు కష్టాలు పడ్డారు. రెంటికోట, తర్లాకోట, కైజోల, కొత్తూరు, సవరగోవిందపురం, సుబ్బుగుడ్డి, దానగొర, హిమగిరి, మహాదేవపురం, సున్నాడతో పా టు ఉద్దాన ప్రాంతంలో అనేక చోట్ల ఇప్పటికే కోతలు పూర్తయ్యాయి. చేను ను కుప్పలుగా పెట్టి నచోట్ల టార్పాలిన్లు కప్పి.. రక్షించే ప్రయత్నం చేస్తున్నా రు. ఏటా నవంబ రు, డిసెంబరులో అల్పపీడనాలతో పంట ఇంటికి వచ్చే వరకూ రైతులకు ఆందోళన తప్పడం లేదు.

జలుమూరులో...



జలుమూరు: వరిచేను కుప్పలు పెడుతున్న రైతులు

జలుమూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులతో రైతుల గుండెల్లో గుబులు రేగుతోంది. వర్షం పడే సూచనలు కనిపిస్తుండడంతో కోత కోసిన వరిచేను సంరక్షణకు అష్టకష్టాలు పడుతున్నారు. కోసిన వరి పనల సంరక్షణకు కొంతమంది పొలాల్లోనే కుప్పలు పెడుతుండగా... మరికొంత మంది కల్లాలకు చేర్చుతున్నారు. మండలంలోని అన్ని ప్రాంతాల్లోనూ ముమ్మరంగా వరికోతలు చేపడుతుండడంతో కోసిన వరిచేను భద్రపరచుకోడానికి రైతులు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు.



కోటబొమ్మాళి: ఊడికలపాడులో పంటను కల్లాలకు చేర్చుతున్న రైతులు

నాటి తీపి గురుతులు

● పాత టీవీలు నేటికీ పదిలంగా..

● నేడు ప్రపంచ టెలివిజన్ దినోత్సవం

రేడియో యుగం ముగిసిన తర్వాత ప్రాచుర్యం పొందింది టెలివిజన్. గూడులో పెట్టుకునే బ్లాక్ అండ్ వైట్ మొదలుకుని.. ఇప్పుడు వంద అంగుళాల తెర వరకు అభివృద్ధి చెందింది. అయితే పాత టీవీలను కొంతమంది ఇప్పటికీ భద్రంగా దాచుకున్నారు. నాటి తీపి గురుతులను అప్పుడప్పుడూ నెమరు వేసుకుంటున్నారు. కొంతమంది అయితే పాత టీవీలలోనే ఇప్పటికీ కార్యక్రమాలు వీక్షిస్తున్నారు. శుక్రవారం ప్రపంచ టెలివిజన్ దినోత్సవం సందర్భంగా కథనం..

నాటి టీవీనే మాకు ఇష్టం



పలాస రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 'ప్రస్తుతం గోడకు అంటుకు నే ఆండ్రాయిడ్ టీవీలు నచ్చదు. 1998లో మేము కొనుగోలు చేసిన టీవీయే ఇష్టం' అంటున్నారు పలాస పట్టణం బ్రాహ్మణవీధికి చెందిన టి.ము రళి. అప్పట్లో ఎన్నో వ్యయ ప్రయాసాలతో రూ.14 వేలకు సామ్‌సంగ్ టీవీని కొనుగోలు చేశానని, రిపేరు వచ్చినా ఇప్పటికీ దాన్ని వాడుతున్నానని చెబుతున్నారు. అప్పటివరకూ బ్లాక్ అండ్‌వైట్ టీవీకి అలవాటు పడిన ప్రజలు కలర్‌లోకి మారుతూ వస్తున్న తరుణంలో తాను ఈ టీవీ తీసుకుని వచ్చానని, చుట్టుపక్కల వారు తన ఇంటికి వచ్చి టీవీని చూసేవారని గుర్తు చేసుకున్నారు. 1999 వరల్డ్‌కప్‌ను ఇదే టీవీలో చూడడం ఇప్పటికీ మరచిపోలేనన్నారు. తమ ఇంట్లోవారు కొత్త టీవీ తీసుకువద్దామన్నా నేను వారిస్తున్నానని, పాత టీవీలోనే పాత సినిమాలు, పాత పాటలు చూస్తున్నానని, 27 సంవత్సరాలుగా మరమ్మతులు చేయించుకుంటూ ఆ టీవీనే చూస్తూ ఆస్వాదిస్తున్నానని తెలిపారు.



బ్రాహ్మణవీధికి చెందిన మురళి వినియోగిస్తున్న పాత టీవీ

25 ఏళ్లుగా ఒక టీవీతోనే..

ఎచ్చెర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం కొత్తపేటలో చిన్నపాటి డెయిరీ ఫారం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న సువ్వారు మల్లేశ్వరరావు గత 25 ఏళ్లుగా ఒకటే టీవీతోనే కాలక్షేపం చేస్తున్నారు. గ్రామాల్లోకి టీవీలు వచ్చిన కొత్తలో కొనుగోలు చేసిన టీవీని ఇప్పటి వరకు భద్రంగా ఉంచుకున్నారు. అప్పట్లో టెలివిజన్‌లో ప్రతి గురువారం వచ్చే చిత్రలహరి కార్యక్రమం, అలాగే ఆదివారం సాయంత్రం ప్రసారమయ్యే తెలుగు సినిమా పెద్ద వినోదమని మల్లేశ్వరరావు గుర్తు చేసుకున్నారు. ఇప్పటికీ టెలివిజన్‌లో వచ్చే వార్తలు క్రమం తప్పకుండా వీక్షిస్తున్నట్టు చెప్పారు. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటూ ఇప్పటికీ పాత టీవీనే వాడుతున్నట్టు పేర్కొన్నారు. ఎన్ని ప్రైవేటు ఛానల్స్ వచ్చినా దూరదర్శన్‌లో వచ్చే కార్యక్రమాలను బాగుంటున్నాయని అన్నారు.



కొత్తపేటలో టీవీ వీక్షిస్తున్న సువ్వారు మల్లేశ్వరరావు

రథసప్తమి ఏర్పాట్ల పరిశీలన

● భక్తుల రద్దీకి అనుగుణంగా చర్యలు

● అధికారులతో ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే శంకర్ పలు సూచనలు

అరసవల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష దైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో 2026 జనవరి 25న జరగనున్న రథసప్తమి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం పరిశీలించారు. రథసప్తమిని గత ఏడాది నుంచి రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడంతో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున వారికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులను వారు ఆదేశించారు. రథసప్తమి ఉత్సవాలకు భారీ ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉండడంతో వాహనాల రద్దీ, ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్, అత్యవసర సేవలు, ఆరోగ్య సేవలు, అగ్నిమాపక సేవలు, భక్తుల క్యూ లైన్ల ఏర్పాటు తదితర అంశాలపై ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్‌తో చర్చించారు. గత ఏడాది కలిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అవి పునరావృతం కాకుండా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించి భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆదిత్యుని దర్శించుకునేలా ఏర్పాట్లు చేయనున్నట్లు వారు తెలిపారు.

ఈ ఏడాది మరింత కట్టుదిట్టంగా..

ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. గత ఏడాది ఎక్కడ సమస్యలు ఎదురయ్యాయో ఆ వివరాలు మా వద్ద ఉన్నాయని, వాటిని అధ్యయనం చేసి ఈ ఏడాది మరింత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక బృందాలు, పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది 24 గంటలు విధుల్లో ఉంటారన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ ఏడాది లక్షల్లో భక్తులు వస్తారనే అంచనాలున్నందున వాటికి తగ్గట్టుగానే అన్ని సదుపాయాలు కల్పించి, భక్తులు స్వామిని సజావుగా దర్శించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



రథసప్తమి ఏర్పాట్లపై ఎమ్మెల్యే శంకర్, ఈవో ప్రసాద్‌తో చర్చిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఆపదలో ఉన్నవారికి సీఎం అండ: అశోక్



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

కవిటి/సోంపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో గురువారం నియోజకవర్గంలోని 19 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వైద్య చికిత్సల కోసం సీఎం చంద్రబాబు నాయుడు ఆర్థిక సాయం మంజూరు చేశారన్నారు.

టవర్ ఏర్పాటు చేయొద్దు



టవర్ ఏర్పాటు చేయొద్దని నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

రణస్థలం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రణస్థలంలోని 6వ వార్డుకు ఆనుకుని డబ్ల్యూఎంఈ చర్చి ఆవరణలో సెల్ టవర్ ఏర్పాటుతో ఇబ్బందులు ఎదుర్కొంటామని గ్రామస్థులు వాపోయారు. ఈ మేరకు గురువారం సదరుపనుల వద్ద నిరసన తెలిపారు. టవర్ ఏర్పాటుతో రేడియేషన్, ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణం అధికారులు స్పందించి టవర్ ఏర్పాటును నిలుపుదల చేయాలని కోరారు.

రాజమౌళి క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న స్వామి శ్రీనివాసానంద

పొందూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవుళ్లపై నిర్లక్ష్యంగా మాట్లాడిన దర్శకుడు రాజమౌళి తక్షణం క్షమాపణ చెప్పాలని ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్ అధ్యక్షుడు, ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద స్వామి డిమాండ్ చేశారు. గురువారం ఆనందాశ్రమంలో విలేకరులతో మాట్లాడుతూ.. రాముడు, ఆంజనేయుడు వంటి దేవుళ్లపై రాజమౌళి చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీశాయన్నారు. తక్షణం ఆయన క్షమాపణ చెప్పకుంటే హిందూ సమాజం ఎంత దూరమైనా వెళుతుందని హెచ్చరించారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ నాగరాజు హెచ్చరించారు. గురువారం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆటోలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దన్నారు. మద్యం తాగి ఆటో నడిపితే జైలుశిక్ష తప్పదన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల వినతి

కవిటి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ మురళీమోహన్‌కు వినతి పత్రం అందించారు. డీఏ పునరుద్ధరించాలని, పేస్కేలు అమలుచేయాలన్నారు. అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని కోరారు. సంఘం నేతలు డి.విజయ, వి.కాళిదాసు, జి.లక్ష్మి తదితరులు కోరారు.

ఇంకెన్నాళ్లు?

(ఐదో పేజీ తరువాయి)

ఉంది. ప్రస్తుతం టిడ్కో గృహాల సముదాయం రహదారులు, కాలువలు, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పనులు జరుగుతున్నాయి. మార్చి నాటికి పనులు పూర్తిచేసి.. లబ్ధిదారులు ఇళ్లు అప్పగించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే గొండు శంకర్
- శాఖా గ్రంథాలయాల్లో ముగిసిన వారోత్సవాలు

అరసవల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలను వినియోగించుకుని విజ్ఞానం పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం అనేక మంది విద్యార్థులు, యువత సోషల్ మీడియా మత్తులో పడి విలువైన కాలాన్ని వృథా చేసుకోవడం బాధాకరమన్నారు. అదే సమయాన్ని గ్రంథాలయంలో గడపడం ద్వారా కొత్త కొత్త విషయాలు, విజ్ఞానం పెంచుకోవచ్చన్నారు. గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు ఉన్నాయని, ఉద్యోగార్థులు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు పొండ్రంకి శంకర్, ఎ.కనకరాజు, ఫణీంద్ర శర్మ, గ్రంథాలయ కార్యదర్శి శంకరరావు, లైబ్రేరియన్ భాస్కరరాజు, ప్రత్యూష, వర లక్ష్మి, కల్యాణి, రామ్మోహన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గత వారం రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు.

- గుజరాతీపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని మంచిస్థాయిలో ఉండాలని డా.బీఆర్ అంబేడ్కర్ వర్శిటీ గ్రంథాలయ శాస్త్ర విభాగాధిపతి డా. దువ్వు చక్రపాణి అన్నారు. నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ నేటి యువత సోషల్ మీడియాపై చూపుతున్న శ్రద్ధ పుస్తక పఠనం చూపకపోవడం బాధాకరమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వేణు, లైబ్రేరియన్ కమలాకర్ పాల్గొన్నారు.



విజేతలతో ఎమ్మెల్యే గొండు శంకర్

న్యూస్ బాక్స్

జాబ్‌మేళాను వినియోగించుకోండి

పొందూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు గాను ఈనెల 24న నిర్వహించనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. ఈ మేరకు ఆయన 'ఆంధ్రజ్యోతి'తో గురువారం మాట్లాడుతూ.. స్కిల్‌డెవలప్ మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో పొందూరు సిస్టం కళాశాల ఆవరణలో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన 18 నుంచి 30 ఏళ్ల లోపు యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

ఇచ్ఛాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను పరిరక్షించాలని, ఈ హక్కులు వారి సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేస్తాయని హెచ్ఎం జి.యశోద అన్నారు. గురువారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని బలరాంపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

లావేరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కొత్తకుంకాంలో పెదకోనేరు ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించారు. 'ఆక్రమణలో కొత్తకుంకాం పెద కోనేరు' శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి గురువారం మండల సర్వేయర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్ఐ హారతి, వీఆర్వో ఎం.శ్రీనివాసరావు స్పందించారు. పెదకోనేరును పరిశీలించి ఆక్రమణలు తొలగించి సరిహద్దులను వేయడంతో రైతులు హర్షం వ్యక్తంచేశారు.

గోరువానిపేటలో సత్యసాయి గ్రామసేవ

గార, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) గోరువానిపేటలో అరసవెల్లి సత్యసాయి శాంతి క్షేత్రం ఆధ్వర్యంలో గ్రామ సేవ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మేళ తాళాలతో సాయి పల్లకీ సేవ, వేద పారాయణం, షోడశోపచారాలు, గోపూజ చేశారు. వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి మందిరం కన్వీనర్లు, పలువురు సాయిభక్తులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులను వాడదాం

జి.సిగడాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా స్వదేశీ వస్తువులనే వాడుదామని బీజేపీ మండల అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆత్మనిర్భర్ భారత్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్వదేశీ వస్తువుల వాడకంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఏఎంసీ ఉపాధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, బీజేపీ జిల్లా కార్యదర్శి వజ్జిపర్తి రఘురాం, పలువురు నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలిపాడ్యమి

శ్రీకాకుళం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అత్యంత పవిత్రంగా భావించే కార్తీక మాసం ముగిసింది. మార్గశిరమాసం వచ్చేసింది. శుక్రవారం పోలిపాడ్యమి కావడంతో వేకువ జామున మహిళలు పవిత్ర స్నానాలు చేసి అరటి బొద్దెలలో దీపాలను విడిచిపెడతారు. మొక్కులు చెల్లిస్తారు. కార్తీకమాసంలో శివుడికి ఆరాధించిన భక్తులు ఇకపై శివకేశవుల ఆరాధనకు ప్రాధాన్యమిస్తారు. వైష్ణవ దేవాలయాలను ఎక్కువగా సందర్శిస్తారు. తొలిరోజున పాడ్యమి సందర్భంగా దేవాలయాలను వెళ్లి.. కార్తీకం ముగించి మొక్కులు చెల్లించేస్తారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.సిగడాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గెడ్డకంచరాం- చెట్టుపొదిలాం ఫీడర్ల పరిధిలోని 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.యోగేశ్వరరావు, ఏఈ పి. దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు చేపడుతున్నందున గెడ్డకంచరాం, నడమివలస, శేతుభీమవరం, ఎందువ, బాతువ, చెట్టు పొదిలాం, వెలగాడ, దేవరవలస తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు

- పొందూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తాడివలస సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ యోగేశ్వరరావు, ఏఈ సుధాకరరావు తెలిపారు. విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్టుకొమ్మల తొలగింపు, సబ్ స్టేషన్ మెయింటినెన్స్ నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. దీనివల్ల తాడివలస, బెల మాం, జగన్నాథ పురం, లొద్దలపేట, గోకర్ణపల్లి, కావలి, వాల్తేరు, గోరింట, లైదాం, సిరిపురం, యాగాటిపేట, లట్టపేట గ్రామాల వినియోగదారులు గమనించాలన్నారు.
- ఎచ్చెర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కొయ్యాం సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.యోగేశ్వరరావు తెలిపారు. కొయ్యాం, కేకేనాయుడుపేట, పీకే నాయుడుపేట, బడివానిపేట, నిమ్మవానిపేట తదితర గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.
- పోలాకి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలాకి మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ నర్సింహకుమార్, ఏఈ విశ్వేశ్వరరావు తెలిపారు. ఆక్వాసర్వీసులు, కోడూరు, మగతపాడు, గుప్పెడుపేట, జోగంపేట, కంబాలవానిపేట, డీఎల్‌పురం, సత్రవుపేట, రహిమాన్ పురం, బొద్దాం, ప్రియాగ్రహారం, సంతబొమ్మాళి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.
- సంతబొమ్మాళి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బోరుభద్ర సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టెక్కలి ఈ ఈ నర్సింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. బోరుభద్ర, కొల్లిపాడు, లక్కివలస, మేఘవరం, మరువాడ, మలగాం, పాలతలగాం, ఆర్‌హెచ్‌పురం, జగన్నాథపురం, ఉమిలాడ పంచాయతీల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అందువల్ల గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

'మనోబంధు' ఫౌండేషన్ సేవలు అభినందనీయం

శ్రీకాకుళం క్రైం/అరసవల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనాథ, మానసిక దివ్యాంగుల సేవలో మనోబంధు ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సంస్థతో కలిసి పనిచేయడం అభినందనీయమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయం, కలెక్టరేట్ ఆవరణలో మనోబంధు అంబులెన్స్‌ను, పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనోబంధు ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సంస్థలు సమాజంలోని అత్యంత అవసరమైన మానసిక దివ్యాంగులకు అండగా నిలిచి స్ఫూర్తి కలిగిస్తున్నాయన్నారు. మానసిక దివ్యాంగుల పునరావాసం కోసం ప్రభుత్వం, పోలీస్ శాఖ, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ అంబులెన్స్ ద్వారా జిల్లాలో రోడ్లపై నివసిస్తున్న మానసిక దివ్యాంగులను గుర్తించి వారికి ఆహారం, వైద్యం, ఆశ్రయం వంటి సేవలు అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ బీన ఢిల్లీరావు, రాష్ట్ర సూపర్‌వైజర్ బాల సురేష్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

విలువలున్న సమాజం తత్త్వశాస్త్రంతో సాధ్యం

ఎచ్చెర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విలువలు, మానవత కలిగిన సమాజ నిర్మాణం తత్త్వ శాస్త్రం తోనే సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో గురువారం ఫిలాసఫీ డేని నిర్వహించారు. సాంకేతికత పారదర్శకత జవాబుదారీతనానికి దోహద పడుతుంటే, మానవతా విలువల సమాజ నిర్మాణంలో తత్త్వశాస్త్రం ప్రధాన భూమిక పోషిస్తోందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (శ్రీకాకుళం) అధ్యాపకుడు డాక్టర్ వెంకటరావు మాట్లాడుతూ.. తాత్విక బోధన అధ్యయన అంశాలు అనేక సమస్యలకు పరిష్కారమార్గాన్ని చూపుతాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎం.అనూరాధ, డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు, డాక్టర్ కె.స్వప్నవాహిని, పూర్వపు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఎస్వో డాక్టర్ ఎస్.సామ్రాజ్యలక్ష్మి, డాక్టర్ ఎన్.సంతోష్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. ● వర్సిటీలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ, ప్రొఫెసర్ రజని, గౌరవ లైబ్రేరియన్ డాక్టర్ ఎన్.గోవిందరాజు, వర్సిటీ లైబ్రేరియన్ జి.భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.



తత్వశాస్త్రవేత్త ప్లాటో చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తదితరులు

ముగిసిన పుస్తక మహోత్సవం

పాత శ్రీకాకుళం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో పదిరోజులుగా జరుగుతున్న పుస్తక మహోత్సవం గురువారంతో ముగిసింది. చివరి రోజు సాహిత్య, వైజ్ఞానిక, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆ ప్రాంగణం కళకళలాడింది. సుమారు 20వేల మంది పుస్తక మహోత్సవాన్ని సందర్శంచగా సుమారు రూ.15 లక్షల విలువ చేసే పుస్తకాలు విక్రయించినట్లు నిర్వాహకులు తెలిపారు. కాళీపట్నం రామారావు సాహిత్య వేదికపై 'కళింగాంధ్ర యాస-భాష'పై చర్చ వేదిక నిర్వహించారు. ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న మాట్లాడుతూ.. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తిపంతులు ఆద్యుడని, ఆధునిక భాషా వికాసానికి గురజాడ అప్పారావు కీలకంగా కృషి చేశారన్నారు. ఎల్.ఎన్ కొల్లి రచించిన 'ఎకోస్-ఎంబర్స్', పత్తి సుమతి రచించిన 'డాన్ డాన్ డార్విన్' ఆటపుస్తకాన్ని, మొయిద శ్రీనివాసరావు రాసిన కరవాక పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం షణ్ముఖరావు ఆధ్వర్యంలో బ్రహ్మ సమాజ స్కిట్ డ్రగ్స్ వద్దు బ్రో అంశంపై ఒగ్గుకథ ఆలోచింపజేసింది. హేమ సూదన్ బృందం డప్పు వాయిద్యం ప్రేక్షకులను ఉత్సాహపరిచింది. జేవీవీ ఆధ్వర్యంలో వైజ్ఞానిక కార్యక్రమాలు నిర్వహించారు.



వివిధ పోటీల విజేతలతో నిర్వాహకులు



డ్రగ్స్ వద్దు బ్రో స్కిట్ ప్రదర్శిస్తున్న కొత్తపల్లి విద్యార్థినులు



హేమసూదన్ బృందం డప్పు వాయిద్య ప్రదర్శన

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కవిటి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు మాణిక్యపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం ఎం.వైకుంఠరావు తెలిపారు. సాఫ్ట్‌బాల్ అండర్-14 బాలురు, బాలికల విభాగాల్లో పోటీలకు సుజిత్ర జన్ని, సమీరాసాహు, శివం సాహు, ఎం.హర్షవర్ధన్, డి.నాని ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు కడపజిల్లాలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొంటున్నారన్నారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు..

ఇచ్ఛాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-17 ఖోఖో పోటీలకు డొంకూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం జి.హేమకుమారి తెలిపారు. ఈ మేరకు గురువారం విద్యార్థులను అభినందించారు. ఇటీవల శ్రీకాకుళం ఆర్ట్స్ కలాశాల మైదానంలో జరిగిన ఖోఖో పోటీల్లో బాలికల విభాగంలో డి.మీనా, బి.ధనలక్ష్మి, బాలుర విభాగంలో డి .రవి, బి.దేవరాజు, బి.నవీన్, డి.జస్వంత్ ప్రతిభ కనబరిచారన్నారు. త్వరలో రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ జానకిరావు, పలువురు ఉపాధ్యాయుల పాల్గొన్నారు.









ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడిపై దాడి

మెడపై కత్తిపెట్టి రూ.20 వేలు దోచుకున్న వైనం ● పారిపోతుండగా దొంగలను పట్టుకున్న స్థానికులు

పలాస, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పూండి నుంచి పలాస వెళ్లే ఆర్టీసీ బస్సులో ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తుల ముఠా గురువారం సాయంత్రం హల్‌చల్ చేసింది. కృష్ణారావు అనే ప్రయాణికుడిపై దాడికి దిగడంతో ఆయన ప్రాణభయంతో కండక్టర్ ఉన్న సీటు వద్దకు చేరుకున్నాడు. కాశీబుగ్గ సమీపిస్తున్న సమయంలో కత్తితో దాడి చేసి... గాయపరిచి ఆయన ప్యాంట్ జేబులో ఉన్న రూ.20వేల నగదు దోచుకున్నారు. అనంతరం పారిపోయేందుకు యత్నిస్తుండగా.. కేకలు వేయడంతో బస్టాండులో ఉన్న ఆటో కార్మికులంతా కలసి దొంగలను పట్టుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరు పరారు కాగా.. మరో ముగ్గురు పట్టుబడ్డారు. వారికి దేహశుద్ధి చేసి తాళ్లతో బంధించారు. అనంతరం కాశీబుగ్గ పోలీసులకు అప్పగించారు. విజయవాడ నుంచి బుధవారం ఈ ప్రాంతానికి వచ్చినట్లు వారి వద్ద ఉన్న రైలు టిక్కెట్లను బట్టి తెలుస్తోంది. అనారోగ్యంతో బాధ పడుతున్న కృష్ణారావు కాశీబుగ్గలోని ఆసుపత్రిలో చేరేందుకు శైలాడ వద్ద బస్సు ఎక్కాడు. అందులో అనుమానాస్పదంగా ఐదుగురు యువకులు కనిపించారు. బస్సు ఎక్కినప్పటి నుంచి కృష్ణారావుపై దాడి చేయడానికి యత్నించారు. ఆయన తప్పించుకోవాలని ప్రయత్నించినా వెంబడించినట్లు బాధితుడు తెలిపారు. అనంతరం దాడిచేసి ఆసుపత్రి ఖర్చులకు తెచ్చుకున్న నగదుతో ఐదుగురు వ్యక్తులు ఉడాయించారు. వారిలో ముగ్గురు పట్టుబడగా, ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ వ్యవహారం పలాస-కాశీబుగ్గలో చర్చనీయాంశమైంది. కొద్దిరోజుల క్రితం ఓ వ్యాపారిని కిడ్నాప్ చేసిన సంగతి తెలిసిందే. ఆ ఘటనను మరచిపోకముందే దొంగలు హల్‌చల్ చేయడం తీవ్ర సంచలనం కలిగించింది. ఇదిలా ఉండగా ముగ్గురు అనుమానితులకు స్థానికులు దేహశుద్ధి చేయడంతోపాటు తాళ్లతో బంధించారు. అనంతరం కాశీబుగ్గ పోలీసులకు అప్పగించడంతో వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. ఎస్‌ఐ నర్సింహమూర్తిని వివరణ కోరగా ముగ్గురు అనుమానితులను ప్రశ్నిస్తున్నామన్నారు. వారి వేలిముద్రలు సేకరిస్తున్నామని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్ | భూ వివాదంలో ఇరువర్గాల కొట్లాట


జయరాం నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

జలుమూరు (సారవకోట), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలం గుమ్మపాడు పంచాయతీ ఆగదల గ్రామం వద్ద ఇరువర్గాల మధ్య గురువారం జరిగిన కొట్లాటలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు కథనం మేరకు... అగదల వద్ద గల భూమికి సంబంధించి స్థానికుడు హనుమంతు రామకృష్ణకు, టెక్కలి మండలం తొలుసూరిపల్లి గ్రామానికి చెందిన బమ్మిడి జయరాంకు కొంతకాలంగా వివాదం నడుస్తోంది. వివాదానికి కారణమైన భూమిలో వేసిన వరిచేను మూడు రోజుల కిందట రామకృష్ణ కోత కోయించాడు. బమ్మిడి జయరాం కూడా వరిచేను కోతకోయడానికి వెళ్లాడు. ఇది ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారితీసింది. ఈ కొట్లాటలో బమ్మిడి జయరాం, జలుమూరు మండలం ఎర్రన్నపేట గ్రామానికి చెందిన బలగ నాగభూషణరావులకు గాయాలయ్యాయి. ఇరువర్గాల వారు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ.అనిల్‌కుమార్ తెలిపారు. గాయాలకు గురైన బమ్మిడి జయరాంను బుడితి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి... అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. గాయాలకు గురైన బలగ నాగభూషణరావు నేరుగా నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని..అక్కడ చికిత్స పొందుతున్నాడు.

గుర్తు తెలియని మహిళ మృతి

సంతబొమ్మాళి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నౌపడ గ్రామంలోని కచ్చిరుపారంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం గురువారం కనుగొన్నట్టు ఎస్.ఐ.నారాయణస్వామి తెలిపారు. సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగి.. చీర కట్టుకొని ఉందని ముఖం మొత్తం దెబ్బలు తగిలి ఉన్నాయని ఆయన తెలిపారు మృతదేహంపై గాయాలు ఉండడంతో హత్య చేసి ...ఎవరైనా ఈ ప్రాంతంలో పడివేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

19మంది బైండోవర్

పాతపట్నం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ పట్టుబడిన 19 మందిపై బైండోవర్ కేసులు నమోదైనట్లు ప్రొహిబిషన్ ఎండ్ ఎక్సైజ్ శాఖ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. ఆర్‌ఎల్ పురం, తెంబూరు, చాకిపల్లి, పాతపట్నం, సీది, సీతారాంపల్లి, చంద్రయ్యపేట, గురండి, ప్రహరాజపాలెం, చిన్నమల్లిపురం, పెద్దసున్నాపురం, కాగువాడ తదితర గ్రామాలకు చెందినవారు బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. వీరిని పాతపట్నం తహశీల్దార్ నందిగామ ప్రసాదరావు ముందు హాజరుపరిచినట్టు సీఐ చెప్పారు.

మోసగించిన కేసులో నిందితులకు రిమాండ్

పాతపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బొమ్మిక గ్రామానికి చెందిన యడ్ల ప్రవీణ్ కుమార్, సాయికుమార్‌లకు ఉద్యోగాలిప్పిస్తానంటూ నకిలీ అపాయింట్ మెంట్ లెటర్స్ చూపి మోసపుచ్చిన కేసులో నిందితుడు, శ్రీకాకుళానికి చెందిన కొండాల లోకేశ్వరరావు అనేవ్యక్తికి పాతపట్నం జూనియర్ సివిల్ న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ కె.మధుసూదనరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే... నిందితుడు కొండాల లోకేశ్వరరావుది సారవకోట మండలం చిన్నగుజ్జివాడ గ్రామం. శ్రీకాకుళంలో నివాసం ఉంటున్నాడు. బాధితులు యడ్ల ప్రవీణ్ కుమార్, సాయికుమార్‌లకు ఉద్యోగాలిప్పిస్తానంటూ రూ.8 లక్షలు తీసుకొని మోసం చేసిన ట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరచినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గాజులరామారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. సూరారం పోలీసులు తెలిపిన వివ రాలు ప్రకారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన పి. శ్రీనివాస్‌రెడ్డి (55) కుటుంబ సభ్యులతో గత 30 సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం వచ్చి చింతల మధుసూదన్‌రెడ్డి నగర్‌లో నివాసం ఉంటూ ప్యాకింగ్ మిషన్ రిపేరింగ్ చేస్తుంటాడు. ఇతనికి భార్య, కుమా రుడు, కుమార్తె ఉన్నారు. ఫోన్‌లో వచ్చిన వారి ఇంటికి వెళ్లి ప్యాకింగ్ మిషన్ రిపేరింగ్ చేస్తుంటాడు. గురువారం సూరారంలోని రాజీవ్‌గాంధీనగర్‌లో రిపేర్ ఉందని ఫోన్ రావడంతో వెళ్లాడు. తిరిగి వస్తుండగా సాయిబాబానగర్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా శ్రీనివాస్‌రెడ్డి ద్విచక్ర వాహనం బాలనగర్ నుంచి గండిమైసమ్మ వైపుకు వెళుతున్న డీసీఎం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

కొత్తమ్మతల్లి ఆలయానికి భక్తుల తాకిడి

కోటబొమ్మాళి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి రోజు కావడంతో స్థానిక కొత్తమ్మతల్లి ఆలయానికి గురువారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. సుమారు 600 మందికి అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోరాడ చిన్నగోవిందరావు, సభ్యులు బొమ్మాళి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ

టెక్కలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనలో స్వల్పకాలిక కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 29 వరకు అవకాశం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ తెలిపారు. సీసీటీవీ సూపర్‌వైజర్స్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్, ఎంఎస్ ఆఫీస్ వంటి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు, 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని, అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఆధార్, పాస్‌ఫొటోతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు కో-ఆర్డినేటర్ 94932 90012 నెంబరుకు సంప్రదించాలని సూచించారు.

బాలల హక్కులను పరిరక్షించాలి


మాట్లాడుతున్న మన్మథ కుమార్ మిశ్రో

ఎల్.ఎన్.పేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను పరిరక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సక్షం జిల్లా కన్వీనర్ మన్మథ కుమార్ మిశ్రో తెలిపారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల మోడల్ పాఠశాలలో గురువారం ప్రపంచ బాలల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.రమాదేవి, ఉపాధ్యాయులు ఎన్.రామారావు, పి. లక్ష్మణరావు, టి.ఉపేంద్ర, రెవెన్యూ కార్యదర్శి రమణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఎల్లవేళలా పార్టీ అండదండలు ఉంటాయని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. మెళియాపుట్టి మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన గుమ్మడి యోగీశ్వరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో తెలుగుదేశం పార్టీ ప్రమాద బీమా కింద రూ.5 లక్షల చెక్కును స్థానిక క్యాంపు కార్యాలయంలో మృతుని కుటుంబ సభ్యురాలు గుమ్మడి దేవికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమానికి పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం


సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధితో పార్టీలకు అతీతంగా ఎందరో పేదల ప్రాణాలు కాపాడుతున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నియోజవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 47 మంది లబ్ధిదారులకు రూ.25,17,677 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యానికి పూర్తి భరోసా కల్పిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యాక్రమంలో నియోజవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, నాలుగు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయండి


సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిప్రత్యూష

జలుమూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయిప్రత్యూష అధికారులను ఆదేశించారు. జలుమూరు గ్రామ సచివాలయం, కరవంజ రైతు సేవా కేంద్రంలో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళ్లాలకే సిబ్బంది వెళ్లి ధాన్యం నాణ్యత పరీక్షించి కొనుగోలు చేయాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసి.. మిల్లర్లుకు పంపించాలని చెప్పారు. ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించి.. దళారుల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. తేమ శాతాన్ని గుర్తించే యంత్రం పని చేయకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. జలుమూరు రెవెన్యూలో ఎన్ని ఎకరాల్లో వరిసాగు చేశారు? ఎంత మంది రైతులు ఉన్నారని వ్యవసాయ సహాయకురాలు బరాటం లోకేశ్వరిని అడుగగా సరైన సమాధానం చెప్పకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో తహసీల్దారు జె.రామారావు, ఏవో కింజరాపు రవికుమార్, సివిల్ సప్లయిస్ డీటీ జాఫర్ షరీఫ్, ఆర్.ఐ.జగదీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మనిర్భర్ భారత్‌పై ప్రచారం


సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

టెక్కలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో ఆత్మ నిర్భర్ భారత్‌పై గురువారం ప్రచారాన్ని నిర్వహించారు. బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర మాట్లాడుతూ ప్రతి ఇంటా స్వదేశీ అనే నినాదాన్ని అనుసరించాలన్నారు. 2047 నాటికి భారతదేశం వికసిత్ భారత్‌గా ముందుకు అడుగులు వేస్తుందని తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ మాట్లాడుతూ స్వదేశీ ప్రేరణ దిశగా యువత అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల ప్రకాష్, రాంబాబు, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


సోమేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌతు శివాజీ

హరిపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను మాజీ మంత్రి గౌతు శివాజీ గురువారం పరామర్శించారు. అంబుగాంలో పర్రి నరసింహమూర్తి, లింబుగాంలో మండల పండయ్య, సింక్లాపుట్టుగలో బొడ్డు గణపతి, హరిపురంలో ఎరుకోల సోమేశ్వరరావు, మందసలో సీర గోపాలకృష్ణ మాస్టారి కుటుంబాలను పరామర్శించారు. వారికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగ ప్లాంట్‌కు ఆర్థిక సాయం

హిరమండలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగ ప్లాంట్ ఏర్పాటుకు యువత ముందుకు వస్తే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే ఆర్థిక సాయంతో పాటు ప్రాథమిక ఖర్చుల నిమిత్తం తనవంతుగా రూ.50 వేలు అందిస్తానని జెడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు ప్రకటించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధితో పాటు ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో పంచాయతీలు భ్రష్టు పట్టాయని విమర్శించారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఆయన చెప్పారు. పల్లెలు అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రతి అధికారి, ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ఈ ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కాళీ ప్రసాదరావు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల కదలికలు గుర్తించేందుకే 'సాగర్‌కవచ్'


బెండి గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

వజ్రపుకొత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సముద్రమార్గంలో ఉగ్రవాదుల కదలికలు గుర్తించేందుకే ఏటా సాగర్ కవచ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కాశీబుగ్గ రూరల్ సీఐ ఎం.తిరుపతిరావు తెలిపారు. గురువారం 80 మంది పోలీసులతో దేవునల్తాడ, పూండి, బెండి, బెండిగేటు, వజ్రపుకొత్తూరు. అక్కుపల్లి గ్రామాలల్లో గస్తీ నిర్వహించారు. సముద్ర మార్గం ద్వారా ఉగ్రవాదులు ప్రవేశిస్తే ఎలా గుర్తించాలో స్థానికులు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అపచితులు, అనుమానితులు తారసపడితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన స్థానికులకు సూచించారు. తీరగ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పోలాకిలో...

పోలాకి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత భద్రత కోసం రెండురోజుల పాటు సముద్ర తీరంలో సాగర్ కవచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పోలాకి ఎస్‌ఐ రంజిత్ తెలిపారు. గురువారం రాజరాంపురం, గుప్పెడుపేట, గుల్లవానిపేట, కొత్తరేవు, కంబాలవానిపేట, కొవిరిపేట గ్రామాల వరకూ 50 మంది పోలీసులతో అవగాహన కల్పించామని తెలిపారు. నరసన్నపేట సీఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో తీరం వెంబడి పోలీసులు మోహరిస్తున్నామని ఎస్‌ఐ రంజిత్ చెప్పారు.

ప్రతిభకు ప్రోత్సాహం అవసరం


జ్ఞాపికలు అందిస్తున్న కొరికాన రవికుమార్

పాతపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం అవసరమని సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ తెలిపారు. కె.గోపాలపురంలోని శివానంద కుటీరంలో గురువారం జరిగిన పడాల శ్రీనివాసులు మెమోరియల్ సొసైటీ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. 2024-25లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు , ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కొరికాన భవాని, శ్రీనివాసులు మాస్టారు, సలాన చిరంజీవి, వద్దాది తిరుపతిరావు, తూలుగు తిరుపతిరావు, వినయ్, శాసనపురి కామేశ్వరరావు, మధుబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు తోడ్పాటు..

విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పారిశ్రామికవేత్త దివ్వల జగదీష్ చంద్ర విద్యాసాగర్ తెలిపారు. తెంబూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 2024-25 విద్యాసంవత్సరంలో టెన్త్‌లో 500 మార్కులు పైబడి సాధించిన 16 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5వేల వంతున గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చదువుల విశ్వనాథం, ఉపాధ్యాయురాలు పి.ఇందిర, వైస్ సర్పంచ్ యర్ర ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి


తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఏలు

నందిగాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌ఏలు స్థానిక తహశీల్దార్ పి.సోమేశ్వరరావుకు గురువారం వినతిపత్రం అందించారు వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, అర్హత ఉన్న వారికి వీఆర్‌వోలుగా పదోన్నతి కల్పించాలని, ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారికి వీఆర్‌ఏలుగా నియమించాలని కోరారు.

లైంగిక దాడులకు పాల్పడేవారిని శిక్షించాలి

నరసన్నపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాలికలపై లైగింక దాడులకు పాల్పడే వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఎస్‌వీసీటీ స్వచ్ఛంద సంస్థ, కూచిపూడి నృత్య బృందం ఆధ్వర్యంలో సేవ్ ద చైల్డ్ పేరిట గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉణ్న రాజశ్రీ, రమేష్, రామారావు, ముచ్చేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంతో ప్రజలకు ఇక్కట్లు

పాతపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ పాతపట్నంలో గురువారం విద్యుత్ అంతరాయంతో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. స్థానిక 11కేవీ సబ్‌స్టేషన్ వద్ద సాంకేతిక సమస్యల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. సాయంత్రం సుమారు నాలుగు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

టెక్కలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇజ్జువరం సమీపంలో మూడు రోజుల కిందట గుర్తించిన మృతదేహాన్ని పోలీసులు మూడురోజుల పాటు టెక్కలి ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. ఆ మృతదేహానికి సంబంధించి ఎవరూ ముందుకు రాకపోవడంతో స్థానిక అభయం యువజన సేవా సంఘ సభ్యులు అంత్యక్రియలు పూర్తిచేశారు.

27న శ్రీముఖలింగంలో ప్రతిభా పోటీ పరీక్షలు

జలుమూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకొని ఈనెల 27న గురువారం శ్రీముఖలింగం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు పి.సూర్యప్రభాకరరావు తెలిపారు. ఉత్సాహం గల విద్యార్థులు ఈనెల 25 లోగా పాఠశాలలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

విద్యార్థుల్లో సేవాభావం పెరగాలి

నరసన్నపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సేవాభావం అవసరమని స్థానిక సామాజిక ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ శాంతి ప్రాణిగ్రహి పిలుపునిచ్చారు. గురువారం ఆసుపత్రి ఆవరణలో పద్మావతి డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మొక్కలు నాటే కార్యాక్రమం చేపట్టారు. ఈ కార్యాక్రమంలో సీహెచ్ దుర్గాప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి బాటలు వేయండి

నరసన్నపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు బాటలు వేయాలని ఎమ్పీడీవో వెంకటేష్ ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యాక్రమంలో డిప్యూటీ ఎమ్పీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

రణస్థలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' పథకం అమలు చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, కాంగ్రెస్ కిసాన్ జిల్లా నాయకుడు ఆబోతుల వెంకట నాయుడు డిమాండ్ చేశారు. స్థానిక రైతు సంఘం కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు కౌలు రైతులకు ఇచ్చిన హామీని అమలుచేయాలన్నారు.

అజ్జరాంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ఎచ్చెర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో అజ్జరాం గ్రామంలో గురువారం ప్రత్యేక సేవా శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే యువత సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. ఈ శిబిరం ఈనెల 26వ తేదీ వరకు కొనసాగుతుందని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ తెలిపారు. అనంతరం వైద్య శిబిరం నిర్వ హించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 పీవో డాక్టర్ డి.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

మెళియాపుట్టి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మెళియాపుట్టిలో సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, పాతపట్నం జనసేన ఇన్‌చార్జి కొరికాన భవాని ఆధ్వర్యంలో గురువారం ఘనంగా అయ్యప్ప పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. పెద్దసంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దుక్క బాలరాజు, సలాన అప్పలనాయుడు పాల్గొన్నారు.